సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 9 । మార్చి । 2023



రూ.లక్ష విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు యనమదల సూర్యనారాయణ, పార్వతి దంపతులు (డిప్పకాయలపాడు) బుధవారం రూ. 1,00,116 విరాళం ఇచ్చారు.



నిత్యాన్నదానానికి రూ.50 వేలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కల్వకొలను ఆదినారాయణ దంపతులు (తాతాజీ - అమలాపురం) బుధవారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

వెండి కిరీటం సమర్పణ



మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామ దేవత శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి కొమ్ముల సత్యనారాయణ (శివ), గౌరీచందు దంపతులు రూ.1.50 లక్షల విలువైన రెండు కిలోల వెండి కిరీటాన్ని బుధవారం అందజేశారు.

న్యూస్‌రీల్

వెంకన్న సన్నిధిలో దర్శకుడు 'బోయపాటి'



సినీ దర్శకుడు బోయపాటి శ్రీనుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడంతో మనసుకు ప్రశాంతత కలిగిందని సినీ దర్శకుడు బోయపాటి శ్రీను అన్నారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి చరిత్రను వివరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను బోయపాటికి అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి మచిలీపట్నానికి చెందిన డి.లక్ష్మీ సరస్వతి జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు బుధవారం రూ.50 వేల విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు ఇచ్చారు. దాతలకు స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆయన అందజేశారు.

తలుపులమ్మ తల్లికి రూ.2.13 కోట్ల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో 2023–24 సంవత్సరంలో వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు లైసెన్సులు జారీ చేసేందుకు బుధవారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. దీని ద్వారా అమ్మవారికి రూ.2,12,85,287 ఆదాయం సమకూరిందని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి రూ.50.15 లక్షలు అధికంగా ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. పూజా సామగ్రి, కొబ్బరి కాయల విక్రయానికి రూ.71,11,999; వస్త్రాల విక్రయం, అమ్మవారికి సమర్పించిన వస్త్రాలు పోగు చేసుకునేందుకు రూ.61,21,99; తలనీలాల సేకరణకు రూ.24.01 లక్షలు; ఫ్యాన్సీ సామాన్లు, యంత్రాల విక్రయానికి రూ.15.54 లక్షలు; క్యాంటీన్, కాఫీ మెషీన్ నిర్వహణకు రూ.3.20 లక్షలు; ఐస్‌క్రీమ్, బటర్‌మిల్క్, పెరుగు విక్రయానికి రూ.12 లక్షలు; శీతల పానీయాలు, మినరల్ వాటర్ బాటిల్స్, కిరాణా సామగ్రి విక్రయానికి రూ.17 లక్షలు; తోపుడు బళ్లపై విక్రయాలకు రూ.2,25,090; ఫ్యాన్సీ సామాన్ల విక్రయానికి రూ.6,51,199 చొప్పున లభించాయని ఈఓ వివరించారు.



ఆలమూరు ఎర్రకాలనీలో రూపుదిద్దుకున్న పేదల ఇళ్లు

గృహత్తరం

- ఉగాదికి కొత్త ఇంట్లోనే పేదలు
- జిల్లాలో శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు
- పండగకు 8,620 గృహాలు పూర్తి చేయాలనేది లక్ష్యం

సాక్షి అమలాపురం: ఆశయానికి ఆచరణ జోడిస్తే.. చక్కని ప్రణాళికతో ముందుకెళ్తే అనుకున్నది నెరవేరుతుంది.. కలల సౌధం సాక్షాత్కరిస్తుంది.. ప్రభుత్వం బృహత్తర లక్ష్యంతో చేపట్టిన పేదల ఇల్లు పురుడు పోసుకుంటోంది.. నిరు పేదలకు నీడనివ్వడానికి సిద్ధమవుతోంది.. రాబోయే తరాలు కథగా చెప్పుకొనే సంక్షేమ సంతకంగా నిలవబోతోంది. పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణాలను ఇప్పటికే వేగవంతం చేసింది.

జిల్లాలో ఉగాది లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాలు ఇలా..

నియోజకవర్గం	నిర్మించాల్సిన ఇళ్లు	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
అమలాపురం	866	433	433
ముమ్మిడివరం	780	479	301
రాజోలు	562	290	272
పి.గన్నవరం	150	62	88
కొత్తపేట	1,473	1,226	247
మండపేట	3,428	1,651	1,777
రామచంద్రపురం	1,361	868	493

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నాటికి లక్ష్యం మేరకు ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించేందుకు జిల్లా యంత్రాంగం శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. ఇందుకు గృహనిర్మాణ శాఖతో పాటు, డ్వామా, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, ఏపీఈపీడీసీఎల్ తదితర శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి.

నవరత్న పథకాల్లో పేదలందరికీ ఇళ్లు కీలకమైంది. కొత్తగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధి ఏడు నియోజకవర్గాల్లోని రామచంద్రపురం, మండపేట, అమలాపురం, ముమ్మిడివరం అర్బన్‌తో పాటు 22 మండలాల్లో 23,944 గృహాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకూ 5,009 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన అధికారులు ఉగాది నాటికి 8,620 పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ ఇంకా 586 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. బిలో బేస్‌మెంట్ లెవెల్‌లో 10,731 ఇళ్లు, బేస్‌మెంట్ లెవెల్‌లో 6,127, రూఫ్ లెవెల్‌లో 610, శ్లాబ్ స్థాయిలో 677 ఉన్నాయి. ఉగాది పండగకు లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలని జిల్లా యంత్రాంగం పట్టుదలతో పనిచేస్తోంది. లక్ష్యానికి ఇంకా 3,611 ఇళ్లు తక్కువ. వీటి నిర్మాణాన్ని అధికారులు వేగవంతం చేశారు. మరోవైపు జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, తాగునీరు, కల్వర్టులు వంటి



జగనన్న కాలనీలో ముచ్చటగొలుపుతున్న ఇళ్లు

పనులను ఆయా శాఖల అధికారులు వేగవంతం చేశారు.

ముందు వరుసలో కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఉగాదికి ఈ నియోజకవర్గంలో మొత్తం 1,473 ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకూ 1,226 ఇళ్లు (84 శాతం) పూర్తి చేశారు. ఇంకా 247 ఇళ్లు నిర్మించాలి. ఈ నియోజకవర్గంలోని ఆలమూరు ఎర్రకాలనీలో కొత్తగా ఓ కాలనీ ఏర్పడింది. ఇక్కడ సుమారు 300 వరకూ ఇళ్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 150కి పైగా పూర్తయ్యాయి. ఆత్రేయపురం మండలం ర్యాలీలో సైతం నిర్మాణాలు జోరందుకున్నాయి.

▸▸ మండపేట నియోజకవర్గంలో జిల్లాలో అత్యధికంగా 3,428 ఇళ్లు నిర్మించనున్నారు. ఇప్పటి వరకూ 1,651 ఇళ్లను (48 శాతం) పూర్తి చేశారు. రాయవరం మండలం సోమేశ్వరంలో సైతం జగన్న కాలనీ నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఇక్కడ సుమారు వందకు పైగా గృహాలు పూర్తయ్యాయి.

▸▸ రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో 1,361 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉండగా, 868 ఇళ్లు నిర్మించారు. వెలంపాలెం, ద్రాక్షారామలో సైతం పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు.

దృష్టిపెట్టి.. అవగాహన కల్పించి..

జిల్లాలో ఇప్పటి వరకూ ఇంకా 11,317 ఇళ్ల నిర్మాణాలు ఆరంభం కాలేదు. వీటిలో 586 ఇళ్ల నిర్మాణాలు అసలు ప్రారంభం కాకపోగా, బిలో బేస్‌మెంట్ లెవెల్‌లో 10,731 ఇళ్లు ఉన్నాయి. వీటిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. లబ్ధిదారులకు అధికారులు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ఇదే సమయంలో తక్కువ ధరకు బేస్‌మెంట్ నిర్మాణంపై విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. సచివాలయ ఇంజినీర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు కలసి రూ.70 వేల నుంచి రూ.80 వేలలో బేస్‌మెంట్ పూర్తి చేసే డిజైన్ రూపొందించారు.

జీవితాంతం రుణపడి ఉంటాం



సీఎం జగన్ పుణ్యమా అని సొంతింటి కల నెరవేరింది. ఇప్పటి వరకూ ఇల్లు లేక అనేక అవస్థలు పడ్డాం. మా వంటి పేదల ఇంటి కలను నెరవేర్చిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– గుత్తుల ఆదిలక్ష్మి, లబ్ధిదారు, సోమేశ్వరం, రాయవరం మండలం

తక్కువ ఖర్చుతో బేస్‌మెంట్



పేదలకు నిర్మించే ఇళ్లకు బేస్‌మెంట్ తక్కువ ఖర్చయ్యేలా మోడల్ రూపొందించాం. ఇంటికి రూ.80 వేల వరకూ బేస్‌మెంట్‌కు అవుతోంది. ప్రభుత్వం రూ.70 వేలు ఇస్తోంది. లబ్ధిదారులు రూ.పది వేలు వేసుకుంటే పూర్తవుతుంది. వారు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి.

– ఎం.బాబూరావు, పీడీ, గృహ నిర్మాణ శాఖ

గంగా పుష్కర కాశీ యాత్రకు వెళ్దామా..

రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు



కొత్తపేట: గంగానదీ పుష్కరాల సందర్భంగా రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి కాశీ యాత్ర ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్టు ఆ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కొత్తపేటలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గంగా నదీ పుష్కరాలు ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకూ జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పుష్కరాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం వచ్చే నెల 21న ప్రత్యేక బస్ సర్వీసు వేశామన్నారు. 12 రోజుల యాత్రలో అరసవల్లి, పూరి, కోణార్క్, భువనేశ్వర్ (లింగరాజు దేవాలయం), జాజిపూర్ (గిరిజాదేవి శక్తిపీఠం), కోల్‌కతా కాళీమాత దేవాలయం, గయ (మాంగల్య గౌరీ శక్తి పీఠం), బుద్ధగయ, కాశీ (మూడు రోజులు), విశాలాక్షి శక్తిపీఠం, సీతామడి, అయోధ్య, ప్రయాగ (త్రివేణీ సంగమం, మాధవేశ్వరి శక్తిపీఠం), నైమిశారణ్యం, చిత్రకూట్ క్షేత్రాలను దర్శనం చేయిస్తారన్నారు. ఈ యాత్రకు సూపర్ లగ్జరీ బస్ సర్వీసు ఏర్పాటు చేశామని, మనిషికి భోజన సదుపాయంతో కలిపి రూ.15 వేల టిక్కెట్ ధర నిర్ణయించినట్టు తెలిపారు. ఈ కాశీ యాత్రకు వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిక్కెట్లు, ఇతర వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ ఎం.అచ్యుతాంబ 73829 11871, ఆర్‌ఎస్ రావు 73829 12398కు ఫోన్ చేసి సంప్రదించాలని అన్నారు.

ఆధునీకరణకు లాక్కుపోదాం



కొత్తపేట మండలం పలివెల వద్ద లాకులు

- సాగునీటి సక్రమ సరఫరాకు చర్యలు
- 11 లాకుల మరమ్మతులకు రూ.50 లక్షలు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడి

అమలాపురం టౌన్: ఇక సాగునీరు సజావుగా సాగనుంది.. పంట పొలాల వైపు వెళ్లనుంది.. నిధుల విడుదలతో లాకుల సమస్యకు తెర పడనుంది.. తక్షణ పనులతో ఫలితం చేకూరనుంది.. జిల్లాలో సాగునీటి సక్రమ సరఫరాకు అత్యవసర చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు. దీనికోసం 11 లాకుల మరమ్మతులకు కలెక్టర్ నిధి నుంచి రూ.50 లక్షలు కేటాయించానన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఓ ప్రకటన విడుదల చేశారు. పంట కాలువలపై షట్టర్లకు గతంలో ఏ విధమైన మరమ్మతులు చేపట్టక సాగునీరు సక్రమంగా అందని పరిస్థితులు ఉండేవన్నారు. మరమ్మతులకు గురైన 11 లాకులను గుర్తించి షట్టర్లను ఆధు



హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్

నీకరిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలో అల్లవరం మండలం కొమరగిరిపట్నం వద్ద ఉప్పునీటిని పంట కాలువలోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు అవసరమైన టైడల్ రెగ్యులేటర్‌కు దెబ్బతిన్న షట్టర్ల స్థానే కొత్తవి ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలు కేటాయించామన్నారు. ఇదే రెగ్యులేటర్‌కు రెండో దశలో రూ. 4.99 లక్షలు ఖర్చు చేస్తామన్నారు. రాజోలు పరిధిలోని పాడైన గేట్లను తొలగించి రూ.3.75 లక్షలతో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి వద్ద పాడైన షట్టర్ల స్థానే రూ.4.95 లక్షలతో కొత్తవి అమర్చనున్నామన్నారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి వద్ద రూ.5 లక్షలతో నూతన షట్టర్లు, అయినాపురం- వాడపర్రు చానల్ లాకుకు రూ.5 లక్షలతో షట్టర్లు, కొత్తపేట మండలం పలివెల లాకులకు రూ.6.50 లక్షలతో మరమ్మతులు, ముక్తేశ్వరం సెక్షన్‌లో షట్టర్లకు రూ.5 లక్షలు, చింతల్లంక-అన్నంపల్లి లాకు షట్టర్లకు రూ.5 లక్షలు, కొత్తపేట సెక్షన్‌లో రూ.5 లక్షల చొప్పున కొత్త షట్టర్ల కోసం నిధులు కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు. వార బంధీ విధానం ద్వారా సాగునీరు సరఫరా కావాలంటే ఈ కాలువలపై ఉన్న లాకులకు మరమ్మతులు అత్యవసరమని భావించి తక్షణమే నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పనులను మూడు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. వార బంధీ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లాకులకు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టడం ద్వారా వార బంధీ విధానంలో సాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

అన్నీ తానై నడిపించేది ఆమె



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎంపీ అనురాధ తదితరులు

ఎంపీ అనురాధ

అల్లవరం: ఆధునిక మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో అన్నీ తానై ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఎంపీ అనురాధ అన్నారు. బుధవారం మొగళ్లమూరులోని ఎంపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా నేతలతో కలసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, అంతరిక్షంలో పరిశోధనలు చేసే స్థాయికి ఎదగారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత రాష్ట్రపతి పదవి ఓ మహిళే అలంకరించారన్నారు. పిల్లల్ని పురోభివృద్ధికి తీసుకురావడంలో అతివల పాత్ర కీలమైందన్నారు. రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. అంతేకాకుండా ప్రత్యేక కోర్టులు, చట్టాలు ఏర్పాటు చేసి వారి జీవితాలకు భరోసా కల్పిస్తున్నారని ఎంపీ అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. వీటిని అందిపుచ్చుకుని మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నారు. పలు మండలాల నుంచి వచ్చిన మహిళామణులు ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం చైర్మన్ కాశి మునికుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచులు రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, తోట శ్రీదేవి, ఎంపీటీసీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై ఆటోలకు నో



రత్నగిరి టోల్‌గేట్ వద్ద బారులు తీరిన ఆటోలు

- ఇన్‌చార్జి ఈఓ ప్రకటన
- తక్షణం అమలు

అన్నవరం: రత్నగిరి పైకి ఆటోలను అనుమతించబోమని అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దీనిని తక్షణం అమలులోకి తీసుకువచ్చామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా విజయవాడ, సింహాచలం, అన్నవరం తదితర దేవస్థానాల్లో 2021 అక్టోబర్ 13 నుంచి ఆటోలను నిషేధిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు దేవస్థానానికి త్రీ సీటర్, సెవెన్ సీటర్ ఆటోల అనుమతిని తక్షణమే రద్దు చేస్తున్నామని తెలిపారు.

భక్తుల కోసం దేవస్థానం బస్సులు

అన్నవరం దేవస్థానం రవాణా విభాగం నడుపుతున్న ఆరు బస్సులలో ఐదు పాడైనందున.. భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఇప్పటి వరకూ రత్నగిరి పైకి ఆటోలను అనుమతించామని ఈఓ వివరించారు. ప్రస్తుతం దేవస్థానానికి చెందిన మూడు బస్సులు రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భక్తులను రత్నగిరికి చేరవేస్తున్నాయన్నారు. ఈ నెల 12 నుంచి మరో మూడు బస్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కొండ దిగువ నుంచి పైకి రూ.5, కొండ దిగువ నుంచి రైల్వే స్టేషన్‌కు రూ.10, కొండ మీద నుంచి రైల్వే స్టేషన్‌కు రూ.15 చొప్పున సర్వీస్ చార్జీగా నిర్ణయించామని ఈఓ పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి, టోల్‌గేట్ నుంచి రత్నగిరి పైకి దేవస్థానం బస్సులు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

అయోమయంలో ఆటో డ్రైవర్లు

రత్నగిరికి ఆటోల అనుమతిని రద్దు చేయడంతో ఆటో డ్రైవర్లు అయోమయంలో పడ్డారు. అన్నవరంలో సుమారు 250 ఆటోలు ఉన్నాయి. 250 మంది ఆటో యజమానులు, డ్రైవర్లు వాటిపై ఆధారపడి ఉన్నారు. సాధారణంగా ఆటోలకు రైల్వే స్టేషన్ నుంచి రత్నగిరికి, అలాగే కొండ దిగువ నుంచి రత్నగిరికి గిరాకీ ఎక్కువ. ఈఓ ఆదేశాల ప్రకారం రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల నుంచి రత్నగిరి టోల్‌గేట్ వరకూ మాత్రమే ఆటోలు నడపాల్సి ఉంటుంది. 2021లో కూడా కమిషనర్ ఆదేశాలంటూ ఇదే విధంగా రత్నగిరిపైకి ఆటోలను అనుమతించలేదు. అప్పట్లో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. వారి సమస్యను ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ దేవదాయ శాఖ కమిషనర్ డాక్టర్ హరి జవహర్‌లాల్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కొన్ని షరతులతో రత్నగిరికి ఆటోలను అనుమతించేలా అప్పటి ఈఓ వి.త్రినాథరావుకు కమిషనర్ ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చారు. ఆ నేపథ్యంలో రత్నగిరికి ఆటోలను మళ్లీ అనుమతించారు. ఇన్‌చార్జి ఈఓ అజాద్ తాజాగా ఇచ్చిన ఆదేశాలపై ఆటో డ్రైవర్లు మరోసారి ఎమ్మెల్యే పర్వతను కలవాలని యోచిస్తున్నారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్

- టైమ్ టేబుల్‌లో స్వల్ప మార్పు
- 1 – 9 తరగతులకు ఎఫ్‌ఏ–4 పరీక్షలు

రాయవరం: పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారం నుంచి నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి ముందు నిర్వహించే ప్రీ ఫైనల్ పరీక్షలు విద్యార్థుల స్థాయిని తెలుసుకునేందుకు ఉపయోగపడనున్నాయి. ప్రీ ఫైనల్‌కు సంబంధించి తొలుత విడుదల చేసిన షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. ఈ పరీక్షలు ఉదయం కాకుండా మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకూ నిర్వహిస్తారు. ప్రీ ఫైనల్ పరీక్షలకు ప్రింటెడ్ పేపర్లు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే పరీక్ష పేపర్లు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. పరీక్ష పత్రాలను ఏరోజుకారోజే విడుదల చేస్తారు.

ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్ ఇదీ..

తొమ్మిదో తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు) 100 మార్కులకు, కాంపొజిట్ కోర్సు విద్యార్థులకు 70 మార్కులకు నిర్వహిస్తారు. 10న సెకండ్ లాంగ్వేజ్ హిందీ, 14న ఇంగ్లిషు, 15న గణితం, 16న సైన్స్, 17న సోషల్, 18న ఓఎస్‌ఎస్‌సీ (సంస్కృతం, అరబిక్, పర్షియన్) పేపర్–1, 20న ఓఎస్‌ఎస్‌సీ (సంస్కృతం, అరబిక్, పర్షియన్) పేపర్–2 నిర్వహించనున్నారు.

నేటి నుంచే ఎఫ్‌ఏ–4

విద్యా శాఖ ఏటా నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ), రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎఫ్‌ఏ పరీక్షల్లో చివరివైన ఎఫ్‌ఏ–4 పరీక్షలు 1 – 9వ తరగతుల విద్యార్థులకు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇవి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 14వ తేదీ వరకూ పాత విధానంలోనే జరగనున్నా యి. వీటికి పేపర్లను ఆన్‌లైన్‌లో ఆయా ప్రధానోపాధ్యాయులకు పంపించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఎయిడెడ్ యాజమాన్యంలో 15,956, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో 4,71,958, ప్రైవేటు యాజమాన్యంలో 2,59, 838 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. వచ్చే నెలలో జరగనున్న ఎస్‌ఏ–2 పరీక్షలను 1–8 తరగతులకు సీబీఏ విధానంలోను, తొమ్మిదో తరగతికి మాత్రం పాత విధానంలోను నిర్వహించనున్నారు.

కట్టుదిట్టంగా నిర్వహించాలి



పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ప్రీ ఫైనల్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలి. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా నిర్వహించేలా కింది స్థాయి వరకూ ఆదేశాలు ఇచ్చాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

పేదల బియ్యం పక్కదారి

- 23 టన్నులు స్వాధీనం
- అక్రమ రవాణాపై అధికారుల నిఘా



ఆలమూరులో సీజ్ చేసిన రేషన్ బియ్యం లారీ, నిందితుడితో అధికారులు

ఆలమూరు: పేదల బియ్యం పక్కదారి పడుతోంది.. గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతోంది.. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడికక్కడే నిఘా ఉంచింది. అక్రమార్కుల భరతం పడుతోంది.. మూడు రోజుల వ్యవధిలోనే ఆలమూరు మండలం జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లో సుమారు రూ.70 లక్షల విలువైన అనేక టన్నుల రేషన్ బియ్యం, మినీ వ్యాన్, లారీని సీజ్ చేయడం గమనార్హం. ఆ వివరాలలోకి వెళితే.. సోమవారం జొన్నాడలో 5.3 టన్నుల బియ్యం లోడుతో వ్యాన్‌ను సీజ్ చేశారు. ఇదిలా ఉంటే బుధవారం ఆలమూరు ప్రధాన రోడ్డులో పది చక్రాల లారీలో తరలిస్తున్న 910 బస్తాల్లో నింపిన 23 టన్నుల రేషన్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం, లారీ విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అంచనా. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో ఓ రైస్‌మిల్లు నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా కాకినాడకు తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్థానిక ఎస్.మలుపు వద్ద బియ్యం లారీని ఆపి తనిఖీలు చేశారు. రేషన్ బియ్యం అని గుర్తించిన అధికారులు ఆ వాహనాన్ని ఆలమూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎంఎస్‌ఓ టి.సుబ్బరాజు నేతృత్వంలోని పౌరసరఫరాల శాఖ అధికారులు పరీక్షించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు సీజ్ చేసిన బియ్యాన్ని మండపేట గోడౌన్‌కు తరలించగా లారీని పోలీసులకు అప్పగించారు. ద్రాక్షారామకు చెందిన డ్రైవర్ బత్తుల ధనరాజును అదుపులోకి తీసుకుని మిగతా వ్యక్తుల పాత్రపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు ఎస్సై ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులం పిలుస్తోంది.. రారమ్మని..



గురుకుల పాఠశాల

- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు
- 24 వరకూ గడువు
- వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష

రాయవరం: చదువరులకు ఇదో సదావకాశం.. గురుకులం రారమ్మని పిలుస్తోంది.. ఉచిత విద్య అందించేందుకు దరఖాస్తులు కోరుతోంది.. పేద, మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. కార్పొరేట్ తరహాలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకసారి సీటు పొందితే వసతితో పాటు ఇంటర్మీడియెట్ వరకూ ఉచితంగా చదువుకునే అవకాశం కలుగుతుంది. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు నీట్/ఐఐటీలో ఉచితంగా శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏప్రిల్ 23న జరిగే కామన్ టాలెంట్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 21 గురుకులాలు ఉన్నాయి. అనపర్తి మండలం కొత్తూరు జూనియర్ కళాశాల మినహా మిగిలిన 20 గురుకులాల్లో ఐదో తరగతికి 80 సీట్లు చొప్పున 1,600, తుని మండలం లోవకొత్తూరులోని పాఠశాల మినహా మిగిలిన 20 జూనియర్ కళాశాలల్లో 1,600 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాలికలకు 16, బాలురకు 5 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో తొమ్మిది, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఆరు చొప్పున గురుకుల పాఠశాలలున్నాయి. ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసినప్పుడే నీట్, ఐఐటీ శిక్షణల్లో దేనిని తీసుకుంటారో ఆప్షన్ ఇవ్వాలి. వారిని ప్రభుత్వం నిర్వహించే కామన్ పరీక్షలకు పంపిస్తారు. ఉత్తమ ప్రతిభ చూపితే రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పరీక్షలకు పంపుతారు. ఇందులో రాణిస్తే కర్నూలు (చిన్నటేకూర్), గుంటూరు (గోరంట్ల), విజయవాడ (ఈడ్పుగల్లు) గురుకులాల్లో నీట్, ఐఐటీలకు శిక్షణ ఇస్తారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా 700 సీట్లు కేటాయిస్తారు.

అర్హతలు ఇవీ..

ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టడ్ క్రిస్టియన్ (బీసీ–సీ) విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు 2022–23 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న వారు అర్హులు. వయసు 2023 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్ల దాటకూడదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాది సడలింపు ఉంటుంది. విద్యార్థులు సొంత జిల్లాలో 2021–22 ఏడాదిలో 3వ తరగతి, 2022–23 ఏడాదిలో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలి. ఐదు, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోనున్న విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకూడదు.

దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐదో తరగతికి హెచ్‌టీటీపీఎస్://ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ కాగా, ఇంటర్‌కు హెచ్‌టీటీపీఎస్://ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ఇంటర్ ద్వారా ఈ నెల 24న సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి ఎంపిక చేసుకున్న పాఠశాల/కళాశాల వివరాలను తప్పనిసరిగా రాయాలి. వివరాలు సబ్మిట్ చేసిన తర్వాత మార్చుకోవడానికి అవకాశం ఉండదు.

పదో తరగతి, ఇంటర్ గురుకుల పాఠశాలలు

ప్రాంతం	ఎస్ఎస్‌సీ	ఇంటర్
తూర్పుగోదావరి జిల్లా		
ఎల్ఎన్ పురం	బాలురు	సీఈసీ, హెచ్ఈసీ
బొమ్మూరు	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
వీరలంకపల్లి	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
కొవ్వూరు	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
కోమటికుంట	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
కొత్తూరు జేసీ	-----	ఎంపీసీ, బైపీసీ (బాలురు)
కాకినాడ జిల్లా		
పి.వెంకటాపురం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
ఎ.మల్లవరం	బాలురు	ఎంపీసీ, బైపీసీ (బాలురు)
సాంబమూర్తినగర్ బాలికలు	ఎంపీసీ, బైపీసీ	
ఏలేశ్వరం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
వి.కొత్తూరు	బాలికలు	సీఈసీ, ఎంఈసీ
జగ్గంపేట	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
చొల్లంగిపేట	బాలికలు	సీఈసీ, హెచ్ఈసీ
పిఠాపురం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
లోవకొత్తూరు	బాలికలు	--------
ముమ్మిడివరం	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా		
రాజోలు	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
గోడి	బాలికలు	ఎంపీసీ, బైపీసీ
గోడి	బాలురు	ఎంపీసీ, బైపీసీ (బాలురు)
పి.గన్నవరం	బాలురు	సీఈసీ, హెచ్ఈసీ (బాలురు)
ద్రాక్షారామ	బాలురు	ఎంపీసీ, బైపీసీ, సీఈసీ (బాలురు)

సద్వినియోగం చేసుకోండి

గురుకులాల్లో ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

–ఎ.మురళీకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్, ఏపీ సాంఘిక సంక్షేమ వసతి, విద్యాసంస్థలు



వేములపల్లిలో యువకుడి దారుణ హత్య

పాత కక్షలే కారణం



సంఘటన స్థలంలో పడిఉన్న శివ

మండపేట: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని రౌడీషీటర్ హత్య చేసిన ఘటన మండలంలోని వేములపల్లిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన బండి శివ (36) స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన హరీష్‌తో కలసి మంగళవారం రాత్రి వేములపల్లి సమీపంలోని దూకుడుమెట్ట వద్ద మద్యం తాగేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి ఒంటి గంట వరకూ ఇద్దరూ మద్యం తాగారు. పాత గొడవలు ఘర్షణకు దారితీయడంతో హరీష్ స్క్రూడ్రైవర్ తీసుకుని శివ తలపై బలంగా పొడిచి పరారయ్యాడు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శివను బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటన స్థలాన్ని డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ పి.శివగణేష్, ఎస్సై బి.శివకృష్ణ పరిశీలించారు. అతన్ని 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హరీష్‌పై రౌడీషీట్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన జరిగిన సమయంలో హరీష్‌తో పాటు ఇంకా ఎవరైనా ఉన్నారనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుని కోసం గాలిస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

ఆగిన బతుకు బండి

- గామన్ బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం
- యువకుడితో పాటు గుర్రం మృతి



గుర్రంపై మృతుడు వెంకటేష్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పెళ్లిళ్లలో వధూవరులను ఊరేగించేది ఆ గుర్రపు బండే.. వేడుకలకు మరింత కళ తెచ్చే ఆ బతుకు చక్రం ఆగిపోయింది.. అనుకోని ప్రమాదం నిర్వాహకుడితో పాటు ఆ బండిని చిదిమేసింది.. గామన్ ఇండియా బ్రిడ్జిపై బుధవారం ఓ గుర్రపు బండిని లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఒక వ్యక్తితో పాటు గుర్రం మృతి చెందగా, మరొకరు, గుర్రం గాయాల పాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం...కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన సిద్ధిగాని వెంకటేష్ (23) వివాహ కార్యక్రమాలకు గుర్రం బండిని అద్దెకు ఇస్తుంటారు. వధూ వధూరులను గుర్రం బండిపై తీసుకెళ్లే పని చేస్తుండేవారు. ఈ నేపథ్యంలో కాకినాడలో జరిగే ఓ వివాహానికి గుర్రపు బండిని, రెండు గుర్రాలను తీసుకుని టాటా ఏస్ వాహనంలో తీసుకెళ్తున్నాడు. కొవ్వూరు దాటిన తర్వాత కాతేరు సమీపంలోని వచ్చేసరికి గామన్ బ్రిడ్జిపై గుర్రపు బండిని తీసుకెళ్తున్న వాహనం టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో వాహనంలోని గుర్రపు బండిని, గుర్రాలను కిందకు దింపి పంక్చర్ వేసుకుంటున్నాడు. ఆ సమయంలో వేగంగా వస్తున్న లారీ వీరిని బలంగా ఢీకొంది. దీంతో గుర్రపు బండి నుజ్జునుజ్జు అయ్యింది. లారీ వెంకటేష్ మీద నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో రోడ్డుపై ఉన్న గుర్రం, వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలవ్వగా మరో గుర్రం కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ప్రమాదంతో బ్రిడ్జిపై ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటేష్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. చనిపోయిన గుర్రాన్ని ప్రభుత్వ పశువుల ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాద స్థలం వద్ద దెబ్బతిన్న గుర్రం బండి, వెంకటేష్ మృతదేహం

దొమ్మేరులో విషాదం

కొవ్వూరు: గామన్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ మృతితో దొమ్మేరులో విషాదఛాయలు అలముకున్నాయి. ఇతనికి తల్లిదండ్రులతో పాటు ఒక సోదరి ఉంది. కుటుంబానికి ఇతనే జీవనాధారం. అతని శ్రమ మీదే కుటుంబం నడుస్తోంది. ఈ ఘటనతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వెంకటేష్‌కు మేనకోడలితో వివాహం చేయాలని అనుకున్నారు. ఇంతలో ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుడు వెంకటేష్ తాత, తండ్రి గుర్రపు బండి నడిపే జీవనం సాగించేవారు.

వెంబడించి... చోరీ చేసి

- కొత్తపేటలో రూ 3.40 లక్షల అపహరణ
- సీసీ కెమెరాలో నిందితుల చిత్రాల నమోదు

కొత్తపేట: బ్యాంకు వద్ద నగదు డ్రా చేసిన వ్యక్తిని వెంబడించి ఆ సొమ్మును అపహరించిన ఘటన కొత్తపేటలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక యూనియన్ బ్యాంక్ (ఆంధ్రాబ్యాంక్)లో గనిశెట్టి వీరరాఘవులు బంగారంపై రూ 3.40 లక్షలు రుణంగా తీసుకుని ఉదయం 11.45 గంటల సమయంలో తన మోటార్ సైకిల్ డిక్కీలో పెట్టుకున్నారు. అనంతరం ఆయన అక్కడికి సమీపంలోని దేవీ సెంటర్ కూల్ డ్రింక్స్ షాపు వద్ద ఆగి, ఆ షాపులోకి వెళ్లి వచ్చేలోపు ఆ మోటార్ సైకిల్ డిక్కీలో పెట్టిన నగదు మాయమైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు స్థానిక యూనియన్ బ్యాంక్, దేవీ సెంటర్‌లోని కనక దుర్గాదేవి ఆలయం సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. కూల్ డ్రింక్స్ షాపు వద్దకు రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాగా వారిలో ముగ్గురు షాపు వద్దకు వెళ్లారు. ఒక వ్యక్తి మోటార్ సైకిల్ డిక్కీ లోంచి నగదు బ్యాగ్ దొంగిలించడం సీసీ ఫుటేజీలో నమోదైంది. బుధవారం క్రైమ్ బ్రాంచ్ పోలీసులు వచ్చి సంబంధిత బ్యాంకు, దుర్గాదేవి ఆలయాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ చోరీపై రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై వి.మణికుమార్ దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా అదే బ్యాంకులో సుమారు రెండేళ్ల కిందట ఒక ఖాతాదారుడు రూ.3 లక్షలు డ్రా చేసుకుని వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు అదే తరహాలో దొంగతనం చేశారు. సుమారు ఏడాది కిందట రావులపాలెం ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి డ్వాక్రా మహిళ తనకు డ్వాక్రా రుణం కింద వచ్చిన రూ.లక్ష తీసుకు వెళుతుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెంబడించి నగదు బ్యాగ్ లాక్కుపోయారు. బ్యాంకుల్లో నగదు డ్రా చేసుకునే వ్యక్తులు తమ చుట్టుపక్కల ఎవరు ఉన్నారనేది గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. ఒకవేళ ఎవరిపైనైనా అనుమానం వస్తే వెంటనే బ్యాంక్ సెక్యూరిటీ సిబ్బందికి లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.



కొత్తపేట దేవీ సెంటర్‌లో నగదు బ్యాగ్ తీసుకు వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి (సీసీ ఫుటేజ్)

హత్య చేసింది ఆ ఇద్దరేనా..?

కొలిక్కి వస్తున్న మహిళ హత్య కేసు

రాయవరం: మాచవరం– పసలపూడి గ్రామాల మధ్య పంట పొలాల్లో జరిగిన మహిళ హత్య మిస్టరీ కొలిక్కి వస్తోంది. గత నెల 24న మండపేట– కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పంట పొలం దిమ్మపై గడ్డివాములో పూర్తిగా కాలిన స్థితిలో మృతదేహం బయట పడింది. మృతదేహం దొరికిన గడ్డివాములో లభించిన జడ క్లిప్పు, గాజు పెంకులు, పాదరక్షల ఆధారంగా ఆ మృతదేహం మహిళదిగానే భావించి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆ ప్రాంతానికి సమీపంలోని దేవుడు కాలనీకి చెందిన మహిళ అదృశ్యం కావడంతో ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. గ్రామంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులకు అదే రోజు రాత్రి అదృశ్యమైన మహిళ గ్రామంలో సంచరించడం గమనించారు. అదృశ్యమైన మహిళే, హత్యకు గురైనట్టు భావించి ఆ కోణంలో పోలీసుల దర్యాప్తు వేగవంతం చేశారు. రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి నేతృత్వంలో మండపేట రూరల్ సీఐ శివగణేష్ గ్రామంలోని అనుమానితులను విచారణ చేయడం ప్రారంభించారు. అదే కాలనీకి చెందిన ఇద్దరు పరారీలో ఉండడంతో దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. ఇదిలా ఉంటే అనుమానితుల తల్లి బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. దీనిపై సీఐ శివగణేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని త్వరలో వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ దేవుడుకాలనీ వాసి

మాచవరం శివారు దేవుడుకాలనీకి చెందిన నల్లమిల్లి పద్మ (51) బుధవారం ఆత్మహత్యకు పాల్పడిందని రాయవరం ఎస్సై సురేష్ తెలిపారు. నల్లమిల్లి పద్మ తన కుమారులైన ఉమామహేశ్వరరెడ్డి, సత్యనారాయణరెడ్డిలతో దేవుడు కాలనీలో నివాసం ఉంటుందన్నారు. రెండు వారాల కిందట మహిళను ఎవరో చంపి గడ్డివాములో వేసి కాల్చి వేసినట్టు, ఆమె దేవుడు కాలనీకి చెందిన కొవ్వూరి సత్యవేణిగా గుర్తించారన్నారు. అయితే గతంలో పద్మ కుమారులు సత్యవేణితో అసభ్యకరంగా ప్రవర్తించారని, అప్పట్లో పెద్దల్లో పెట్టారన్నారు. సత్యవేణిని తన కుమారులే హత్య చేసి ఉంటారని గ్రామస్తులు, పోలీసులు భావిస్తున్నారని, వారం రోజులుగా వారూ కనిపించక పోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు. ఈ మేరకు పద్మ కుటుంబ సభ్యుడు మల్లిడి సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

పెనమలూరు: ఎన్టీఆర్ జిల్లా నూరులోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెనికి చెందిన ఎం.కాశీవిశ్వనాథ్‌కు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జశ్వంత్‌శ్రీసాయి (16) శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు జశ్వంత్‌శ్రీసాయి చదువుకున్నాడు. అనంతరం హాస్టల్ కారిడార్‌లో ఇనుప తీగపై ఆరేసి ఉన్న దుస్తులు తీస్తుండగా ఏసీ వైరు దుస్తులు వేసిన తీగకు తగలటంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. పాఠశాల సిబ్బంది హుటాహుటిన జశ్వంత్‌శ్రీసాయిని కానూరులో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. విద్యార్థి తండ్రి ఎం.కాశీవిశ్వనాథ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతి చెందిన జశ్వంత్ శ్రీసాయి